ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
ఆదివారం 12 అక్టోబరు 2025



### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్ 33/11 కేవీ ఉప కేంద్రంలో నెలవారి మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ లక్ష్మిరాజం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గుండి రోడ్డు, టీఆర్‌నగర్, రాజంపేట, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

● కౌటాలలో..

కౌటాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కౌటాల సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ అంజల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### నిందితులపై చర్యలు తీసుకోవాలి

కెరమెరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం ఖండించారు. ఈ మేరకు ఈ నెల 13న నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జస్టిస్ గవాయ్ దళితుడు కావడం వల్లే దాడి జరిగిందని ఈ దాడి భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. కార్యక్ర మంలో నాయకులు వినేష్, తదితరులు పాల్గొన్నారు.

● రైతులకు నేటికీ అందని రబీ బోనస్
● జిల్లాలో ప్రారంభం కానున్న ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు
● ప్రైవేటు వ్యాపారుల వైపు అన్నదాతల చూపు




బెజ్జూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ వరి పంట దాదాపు పూర్తి కావొచ్చింది. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సైతం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత రబీ సీజన్‌లో సన్న ధాన్యం బోనస్ డబ్బుల కోసం రైతులు ఎదురు చూస్తున్న ప్రస్తుత తరుణంలో ఈసారి ధాన్యం కొనుగోళ్లపై బోనస్ బకాయిల ప్రభావం పడే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాళ్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించడంతో గత రబీతో పాటు ఖరీఫ్ సీజన్‌లోనూ జిల్లాలో రైతులు భారీగా సన్న దాన్యాన్ని సాగు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పెద్ద మొత్తంలో సన్నధాన్యం వస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గత రబీ సీజన్‌లో రైతాంగం అత్యధికంగా సన్నధాన్యాన్ని సాగు చేసినప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన బోనస్ మాత్రం ఇంకా ఇవ్వకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో సన్న ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటే తొందరగా డబ్బులు వస్తాయనే ఆలోచనలో రైతాంగం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ద్వారా మద్దతు ధరతో పాటు బోనస్ కూడా ఇస్తుండటంతో ఎక్కువ శాతం రైతులు సొసైటీలు, ఐకేపీ కొనుగోలు కేంద్రాలకే ధాన్యం కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్న ధాన్యం డబ్బుల చెల్లింపులు, బోనస్ ఆలస్యం వల్ల కొంత మంది రైతులు ప్రైవేటు వ్యాపారుల వైపుచూసే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రప్ర భుత్వం రైతాంగాన్ని ఆదుకునేందుకు బోనస్ ప్రకటించినటప్పటికీ డబ్బులు చెల్లించడంలో ఆలస్యం కారణంగా రైతులు ఎదురుచూస్తున్నారు. ఆరుగాలం పండించిన పంటకు మద్దతు ధర సక్రమంగాలేక ఖర్చులు పెరిగిపోయి బోనస్ డబ్బులతోనైనా పెట్టుబడి సహాయంగా ఉపయోగపడుతుందని భావిస్తున్న రైతులు ప్రభుత్వం బోనస్ ఆలస్యంగా వేయడంతో నిరాశతో ఉన్నారు.

● 56వేల ఎకరాల్లో వరి సాగు...

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 56వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యానికి క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ ఇస్తామని ప్రకటించ డంతో వరి సాగు గణనీయంగా పెరుగుతూ వస్తోం ది. ప్రభుత్వం అందించే బోనస్‌తో ఖరీఫ్ సాగుకోసం పెట్టుబడికి ఆసరాగా ఉంటుందని భావిస్తున్న రైతులకు బోనస్ చెల్లించడంలో ఆలస్యం కారణంగా రైతులు ప్రభుత్వానికి ధాన్యం విక్రయించేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. సన్నాలు సాగుచేస్తే దిగుబడులు రావని చీడపీడల బెడదతో నష్టం ఉంటున్నప్పటికీ రైతులు మాత్రం బోనస్‌తో సన్నాలనే సాగు చేస్తున్నారు. రైతులు సన్నధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో కాక రోజుల తరబడి పడిగాపులు కాసిన ఘటనలు ఉన్నాయి. ఈసారి ధాన్యం కొనుగోళ్లపై బోనస్ ఎఫెక్ట్ పడే అవకాశాలు కూడా ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. రైతులు విక్రయించిన ధాన్యానికి సకాలంలో బోనస్ ఇవ్వని కారణంగా ఏ మేరకు ధాన్యం సేకరణ జరుగుతుందో చూడాలి. అదీగాక స్థానిక ఎన్నికల కోడ్ ప్రభావం కూడా బోనస్‌పై పడిందని భావిస్తున్నారు.

● గత రబీలో 12,730.280 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ..

జిల్లాలో వరిసాగు గణనీయంగా పెరగడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా రికార్డు స్థాయిలో ధాన్యం వస్తుందని అధికారులు అంచనాకు వస్తున్నారు. గత రబీ సీజన్‌లో జిల్లాలో 2,506మంది రైతుల నుంచి 12,730.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. ఇందుకోసం జిల్లాలో యాసంగి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి 40కొనుగోలు కేం ద్రాలు ఏర్పాటు చేశారు. ఐకేపీ ద్వారా 22, సొసైటీల ద్వారా 18 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 2506మంది రైతుల నుంచి ధాన్యం సేకరించగా ఇందులో 1,218మంది రైతులకు బోనస్ రావాల్సి ఉంది. రాష్ట్రప్రభుత్వం క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇవ్వడంతో రైతులు సైతం సన్నరకం ధాన్యం వేయడం ద్వారా లాభం ఉంటుందని భావిస్తు న్నారు. రబీ సీజన్ ముగిసి మూడు నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ బోనస్ రాక అయోమయంలో ఉన్నారు.

### రేపు యథావిధిగా ప్రజావాణి

ఆసిఫాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజవాణి కార్యక్రమం ఈ నెల 13 నుంచి యథావిధిగా కొనసాగించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దత్రే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని, అర్జీదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

### చట్టాలపై విద్యార్థులకు అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయవాది గణపతి

సిర్పూర్(టి), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది గణపతి అన్నారు. శనివారం మండలంలోని వెంపల్లి గ్రామంలో కాగజ్‌నగర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపును సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ డీలర్ తిలావత్, సిబ్బంది రమేష్, వెంకటేష్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మహేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దత్తాత్రేయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 108, 102 వాహనాల తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ నరేష్ యాదవ్

రెబ్బెన, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండల కేంద్రంలో శనివారం 108, 102 అంబులెన్స్ వాహనాలను జిల్లా మేనేజర్ నరేష్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో ఉన్న మెడికల్ స్టాక్, పరికరాలు పని చేస్తున్న తీరును, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కాల్ వచ్చిన వెంటనే అంబులెన్స్ తొందరగా బయలుదేరాలని సిబ్బంది సూచనలు చేశారు. ఆయన వెంట టెక్నిషియన్ పశురాం, పైలట్ సాయి, 102 పైలెట్ నాన్నయ్య తదితరులు ఉన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రమేష్

కెరమెరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలైన పరందోళి, ముక్దాంగూడ, మహారాజుగూడ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రమేష్, చగన్, యూత్ అధ్యక్షుడు బాలకృష్ణ కోరారు. గ్రామాలకు సరైన రోడ్డు, సెల్ సిగ్నల్స్ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజ లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉమ్రికాస్ రోడ్డు నుంచి పరందోళి గ్రా మం వరకు బీటీ రోడ్డు మంజూరు అయినప్పటికీ గతంలో పనులు జరుగు తున్న సమయంలో అటవీ అధికారులు అడ్డుకున్నారన్నారు. వెంటనే సమస్య లను పరిష్కరించాలని కోరారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరిక


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న అనిల్‌గౌడ్

తిర్యాణి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోనివ నాయకపుగూడ గ్రామానికి చెందిన పలువురు శనివారం కాంగ్రెస్‌పార్టీలో చేరగా వారికి జిల్లా నాయకుడు అనిల్‌గౌడ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నర్సయ్య, చంద్రయ్య, రాజన్న, పి.రాజయ్య, వెంకటేష్, రాజబాబు, విఘ్నేష్, చిన్నయ్య, భూమయ్య, అరింద్, వంశీకృష్ణ, లక్ష్మణ్, శాంత, మల్లేశ్వరి, సమ్మక్క, నర్సక్క, మల్లక్క, మల్లేష్, విజయ్, వెంకటేశ్వర్లు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకు ముందు హనుమాన్ ఆలయంలో షెడ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, సాయికిరణ్, అమర్, వెంకటేశంగౌడ్, విజయ్, బాబురావు, మోఇరాం, కిష్టయ్య, భీమయ్య, శ్రీనివాస్, రాంచందర్, పవన్, భీమయ్య, సీహెచ్ భీమయ్య, శ్రావణ్, జనార్ధన్, చిన్నయ్య, సతీష్, శేఖర్, రమేష్, కార్తీక్, లక్ష్మి, రాజక్క, రవీందర్, చంద్రశేఖర్, శేఖర్, రంజిత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం ఎం విజయభాస్కర్‌రెడ్డి, పోటీలను ప్రారంభిస్తున్న జీఎం

రెబ్బెన, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటి పట్టణంలో రాష్ట్రస్థాయి సెపక్ తక్రా అండర్-14, అండర్-19 బాలబాలికల పోటీలను సింగరేణి జీఎం ఎం విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా బాలబాలికల టోర్నమెంట్ గోలేటిలో నిర్వహించడం శుభపరిణామని తెలిపారు. ఇక్కడ ఎన్నో టోర్నమెంట్‌లు జరుగుతున్నాయని, గోలేటిలో ఎంతో మంది జాతీయ, అంతరాష్ట్రీయ స్థాయి టోర్నమెంట్ ఆడినవారు ఉండడం గర్వకారణమన్నారు. సింగరేణి తరపున క్రీడాకారులకు, స్టేట్ అఫీషియల్స్‌కు క్లబ్‌లో గదులు ఇచ్చామన్నారు. సింగరేణి తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఇక్కడికి రావడం గర్వకారణంగా ఉందని, పిల్లలు క్రమశిక్షణతో ఆడి జాతీయ స్థాయిలో పతకాలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర చైర్మన్ రాజారెడ్డి, ఆర్.నారాయణరెడ్డి, ఆర్.నారాయణరావు, రాజయ్య, జరిపుద్దీన్, భాస్కర్, రామకృష్ణ, మల్లేష్, దినేష్, శ్రీనివాష్‌రావు, వెంకటేశ్వర్లు, మహేందర్‌రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్, జగ్గయ్య, చక్రపాణి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటాం
- సీఐ కుమారస్వామి

పెంచికలపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో పోలీసు శాఖ ఎల్లప్పుడు ముంటుందని కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి అన్నారు. శనివారం మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లోని 300 మంది ఆదివాసీ ప్రజలకు రాబిన్ వుడ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సీఐ కుమారస్వామి

### కుమరంభీంకు ఘన నివాళి


కుమరంభీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదివాసులు

జైనూర్ అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్‌లో కుమరంభీం వర్ధంతిని ఆదివాసులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీం విగ్రహనికి ఆదివాసులు సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ కుమరంభీం ఆదివాసులకు హక్కు లు కల్పించడంలో తన ప్రాణాలను లెక్క చేయలేదన్నారు. ఆయన చేసిన పోరాటం ఫలితంగా ఆదివాసులకు కొన్ని హక్కులు దక్కాయన్నారు. ఆదేవిధంగా నేటికి ఆదివాసులకు పూర్తి స్థాయిలో హక్కులు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని ఆరోపించారు. గ్రామాల్లో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించని దౌర్భాగ్యంలో ప్రభుత్వాలు ఆదివాసులపై సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నాయని వారు విమర్శించారు. మారుమూల గ్రామాల్లో ఆదివాసుల ఉన్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పూసం హన్మంత్‌రావ్, పూసం జగత్రావ్, పూసం తులసీరాం, పూసం లింగు, ఊర్వేత దంబి, తదితరులు పాల్గొన్నారు.

### ధన్ ధాన్య కృషి యోజనను సద్వినియోగం చేసుకోవాలి

జైనూర్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వెనుక బడిన రైతుల జీవన ప్రమాణాలు మెరుగు పర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలుచేస్తున్న ధన్ ధాన్య కృషి యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ సూచించారు. వర్చువల్‌గా ప్రధాని నరేంద్రమోది శనివారం ఇచ్చిన ఉపన్యాసాన్ని నాయకులు తిలకించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ రావ్ మాట్లాడుతు రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్ రావ్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెందుర్ ప్రకాష్, మాజీ డైరెక్టర్ కనక గంగారాం, సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీ, మేస్రాం గోవింద్‌రావ్, రైతులు పాల్గొన్నారు.


ప్రధానమంత్రి ఉపన్యాసాన్ని వింటున్న మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రావ్, నాయకులు

## పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక
- ఏఐసీసీ ప్రతినిధి డాక్టర్ నరేష్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎన్నికను పారదర్శకంగా నిర్వహిస్తామని ఎన్నికల పరిశీలకుడు, ఏఐసీసీ ప్రతినిధి డాక్టర్ నరేష్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్ష ఎన్నిక నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకుంటామని ఇందుకు అధిష్ఠానం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుల ఎన్నిక నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ గెస్ట్ హౌజ్‌లో ఉదయం డీసీసీ స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని, మధ్యాహ్నం 12.30 గంటలకు సిర్పూర్ నియోజకవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 13న జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ నియోజకవర్గ సమావేశం, 14న సాధారణ ప్రజలతో పాటు మేధావుల ద్వారా అభిప్రాయాన్ని సేకరిస్తామని తెలిపారు. 19న పోటీలో ఉన్న అభ్యర్థులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని వివరించారు. జిల్లా అధ్యక్ష ఎంపికపై ఎలాంటి ఒత్తిళ్లు ఉండవని, పైరవీలకు తావు లేకుండా ఎన్నిక నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రెండు జిల్లాలో పర్యటించి నివేదికను అధిష్ఠానానికి అందించడం జరుగుతుందని తెలిపారు. అధ్యక్షుల ప్రకటన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకే ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓబీసీ, మహిళా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేసే దిశగా కృషి చేస్తోందన్నారు. పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించడంతో పాటు సమర్థులైన నాయకులను ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. పోటీల్లో ఉన్న అభ్యర్థులకు సంబంధించిన అందరి అభిప్రాయాలను సేకరించడంతో పాటు అభ్యంతరాలను కూడా పరిశీలిస్తామని తెలిపారు. అధ్యక్ష పదవికి పోటీల్లో ఉన్న వారిపై తనకు నేరుగా సలహాలు సూచనలు, ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ పరిశీలకులు శ్రీనివాస్, అనిల్‌కుమార్, జ్యోతి, పీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణక్క, ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు శ్యాం, బాలేష్‌గౌడ్, మల్లేష్, అనీల్‌గౌడ్, అబ్దుల్లా, మునీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ ప్రతినిధి డాక్టర్ నరేష్‌కుమార్

## విత్తనోత్పత్తికి శ్రీకారం

ప్రభుత్వ సహకారంతో సాగు చేస్తున్న రైతులు


క్షేత్ర స్థాయిలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

జైనూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ విత్తనాల బెడద అంతకంతకు పెరుగుతోంది. సీజన్ ప్రారంభానికి ముందే ఏప్రిల్, మే నెలల్లో వీటి విక్రయాలు గుట్టుగా కొనసాగుతుంటాయి. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసే రైతన్నలతో పాటు సేద్య రంగం కూడా తీవ్రంగా నష్టపోతోంది. దేశ ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతోంది. ఇటువంటి ఇబ్బందులు తొలగించడంతో పాటు నకిలీ విత్తనాలకు కళ్లెం వేయడం, భవిష్యత్తులో విత్తన భారం తగ్గించేందకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విత్తనం-రైతన్నలకు నేస్తం పథకం ప్రారంభించింది. రైతులు విత్తనోత్పత్తికి కృషి చేసేలా చర్యలు చేపడుతోంది. జిల్లాలో వానాకాలం సీజనులో రైతులు పత్తి, కంది, వరి, జొన్న, సోయాబీన్, మొక్కజొన్న పంటలను సాగు చేస్తారు. ఈ పంటల సాగులో విత్తనాల ఎంపిక చాలా కీలకం. మేలైన విత్తనాలకు బదులు కొందరు వ్యాపారులు నకిలీ, కల్తీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. విషయం తెలియని వారు ఆరు గాలం శ్రమించినా.. చివరి దశకు వచ్చే సరికి దిగుబడి రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం జిల్లాలోని పలువురు రైతులను ఎంపిక చేశారు. వారికి ఈ సీజన్ ప్రారంభంలోనే విత్తనోత్పత్తి కోసం వరి, కంది, పెసర విత్తనాలు పంపిణీ చేసింది. వారు వీటిని పండించి తోటి రైతులకు విత్తనాలు అందించాలనేదే పథకం ముఖ్య ఉద్దేశం.

క్షేత్ర స్థాయిలో పరిశీలన..

ప్రైవేట్ కంపెనీలపై ఆధార పడకుండా రైతులే సొంతంగా విత్తనోత్పత్తి చేసుకునేలా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. ప్రస్తుతం ఆయా పంటలు పూత దశలో ఉండటంతో విత్తనోత్పత్తి కోసం విత్తనాలు పంపిణీ వ్యవసాయ క్షేత్రాలను వ్యవసాయం శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. పంపిణీ చేసి విత్తనాల పంటలు చాల వరకు ఆశాజనకంగా ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానం సఫలీకృతం అయితే రానున్న రోజుల్లో కొంత మేర విత్తన కొరత తీరే అవకాశం ఉంది. సాధారణ విత్తనాల కంటే విత్తనోత్పత్తి విత్తనాలతో అధిక లాభాలు సాధించడంతో పాటు పెట్టుబడి ఖర్చులు సైతం తగ్గుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

విత్తనోత్పత్తి విధానంతో రైతులకు నాణ్యమైన విత్తనం లభిస్తుంది. విత్తనాలు అధిక దిగుబడులు సాధించడంతో పాటు పెట్టుబడి ఖర్చులను తగ్గిస్తాయి. గ్రామాల్లో రైతులకు పంపీణి చేసిన విత్తనాల పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆనంద్‌రావ్ తెలిపారు.

## రోడ్డుపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

కాసిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసిపేట-మందమర్రి బైపాస్ రోడ్డుపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ రహదారి గుండా ప్రతీరోజు వందల మంది మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వచ్చిపోయే వారికి దుర్గంధం వెదజల్లుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించకుండా రోడ్డుపై పడేయడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



బైపాస్‌రోడ్డుపై పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త

## ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

**పట్టించుకోని అధికారులు**



వంగి ఉన్న విద్యుత్ స్తంభం

కెరమెరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం, ధనోర, జ్యోతినగర్ గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ తీగలు అనేక ఏళ్లుగా ఇళ్లపై వేలాడుతున్నా విద్యుత్ అధికారులు పట్టించున్న దాఖలాలు లేవని గ్రామస్థులు వాపోతున్నారు. ఈదురుగాలులతో విద్యుత్ తీగలు పడి గతంలో ప్రమాదాలు సైతం జరిగాయి. సుమారు 60 ఏళ్ల క్రితం గ్రామాలు ఏర్పడగా ముందుగా అక్కడ వేసిన విద్యుత్ వైర్లు నేటికీ అలాగే దర్శణమిస్తున్నాయి. చిన్నచిన్న మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్‌శాఖ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో విద్యుత్ వైర్లు తెగిపడి పశువులు మరణించిన సందర్భాలు సైతం ఉన్నాయి. ఈ గ్రామాల్లో రైతులు తమ పశువుల కోసం గ్రాసంగా వినియోగించే జొన్న చొప్ప తమ ఇంటి ముందుర పందిర్లపై నిలువ ఉంచుకుంటారు. కాగా విద్యుత్ వైర్లు ఒకటికొకటి తగిలి తెగి పడ్డ సందర్భంగా నిప్పురవ్వలు ఏర్పడి పశు గ్రాసంపై పడి అగ్ని ప్రమాదాలు సైతం ఏర్పడే ప్రమాదం పొంచి ఉన్నట్లు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి 11 కేవీ విద్యుత్ లైన్‌ను మరో చోట ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. అంతే కాకుండా గతంలో గ్రామాల పర్యటనకు వచ్చిన జిల్లా ఉన్నతాదికారులకు అనేకమార్లు విన్నవించినా స్పందించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. అంతే కాకుండా విద్యుత్ స్తంభాలు వంగి వర్షాలకు పడిపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

### మరో చోట ఏర్పాటు చేయాలి..

**లింగయ్య, గోయగాం**



50 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ నేటికీ అలాగే కొనసాగుతోంది. అనేకసార్లు వైర్లు తెగి పడి పశువులు మరణించిన సందర్భాలు ఉన్నాయి. మా గ్రామానికి వచ్చిన అధికారులు, నాయకుల దృష్టికి సమస్యను తెలిపాం. అయినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. లైన్‌ను మరో చోటికి మార్చాలి.



ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు

## అందని సరుకులు.. నిండని కడుపులు

- బిల్లుల పెండింగ్‌తో సరుకులు పంపని కాంట్రాక్టర్ - కస్తూర్బా విద్యార్థులను ఇంటికి పంపుతున్న వైనం





కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు

హాజీపూర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బిల్లుల పెండింగ్ పేరుతో సరకుల పంపిణీ నిలిపివేసిన కాంట్రాక్ట్ చర్యలతో విద్యార్థులకు భోజనం పెట్టలేక హాజీపూర్ మండలంలోని కర్ణ మామిడి కస్తూర్బాగాంధీ బాలిక పాఠశాలలో విద్యార్థులను స్కూల్ ఎస్‌వో, సిబ్బంది ఇళ్లకు పంపిస్తున్నారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 240 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరికి రోజు ఉదయం పాలు, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి తిరిగి భోజనం పెట్టాల్సి ఉంది. దీని కోసం రాజేందర్ అనే కాంట్రాక్టర్ టెండర్ వేసి సరకులు సరఫరా చేస్తున్నాడు.

● **బిల్లులు అందలేదనే కారణంతో..**

కస్తూర్బా పాఠశాలకు సరకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ రాజేందర్‌కు నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో చేతులెత్తేసాడు. దీంతో వేరేదారి లేక శనివారం విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేయించి ఇళ్లకు పంపుతున్నారు. ఇంకా పాఠశాలకు వచ్చే వారికి రెండు రోజుల అనంతరం రావాలని చెబుతున్నారు. దసరా సెలవుల అనంతరం హాస్టల్‌కు చేరుకున్న విద్యార్థులకు పాఠశాల ఎస్‌వో స్వప్న కాంట్రాక్టర్‌కు సరకుల విషయమై సంప్రదించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. చేసేదేమీ లేక వారం రోజులుగా ఎస్‌వో సొంత ఖర్చులతో సరకులు తెప్పిస్తూ విద్యార్థుల కడుపులు నింపుతున్నారు. అయిన కూడా కాంట్రాక్టర్ సరకులు పంపించకపోవడంతో కేవలం ఇంటర్, 10వ తరగతి విద్యార్థులను మాత్రమే హాస్టల్‌లో ఉంచుకుంటూ శనివారం మిగితా తరగతుల విద్యార్థులను ఇళ్లకు పంపించి వేశారు.

### కాంట్రాక్టర్ సరుకులు పంపించడం లేదు...

**స్వప్న, కస్తూర్బా గాంధీ పాఠశాల ఎస్‌వో**

వారం రోజులుగా కాంట్రాక్టర్ రాజేందర్ సరుకులు పంపించడం లేదు. ఫోన్‌లో కూడా అందుబాటులో లేరు. డీఈవోకు విషయం తెలియజేశాం. విద్యార్థులకు తామే సొంత డబ్బులతో సరకులు తెప్పించి టిఫిన్, భోజనం ఏర్పాట్లు చేస్తున్నాం. శుక్రవారం సాయంత్రం బిల్లు మంజూరు అయింది. శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో అకౌంట్‌లో డబ్బు జమ కాలేదు. దగ్గరలో ఉన్న తొమ్మిదో తరగతి లోపు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నాము. రెండు రోజుల్లో తిరిగి యథావిధిగా విద్యార్థులు పాఠశాలకు తిరిగి వస్తారు. తరగతులు జరుగుతాయి.

## నీళ్ల పప్పు...ఉడకని అన్నం

- మోడల్ స్కూల్ విద్యార్థినుల ఆవేదన
- ఇంటి దారి పడుతున్న వైనం

కాసిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ హాస్టల్‌లో గత కొన్ని రోజులుగా నీళ్ల పప్పు ఉడకని అన్నం పెడుతున్నారని హాస్టల్ విద్యార్థినీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌కు రావాల్సిన సరుకులు సకాలంలో అందకపోవడంతో పప్పునీళ్లతోనే కాలం వెళ్లదీస్తున్నామని హాస్టల్ సిబ్బంది చెప్పడం మరింత ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సరైన పౌష్టికాహారం లేక విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు.

నీళ్ల పప్పు ఉడకని అన్నం తినలేకపోతున్నామని కొందరు విద్యార్థినులు ఇంటిదారి పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థినులు కోరుతున్నారు. దీనిపై ఎస్‌వో సరితను వివరణ కోరగా నాలుగు నెలలుగా కూరగాయలు సరఫరా చేసే కాంట్రాక్టర్‌లకు బిల్లులు రాకపోవడంతో కూరగాయల సరఫరాను నిలిపివేశారన్నారు. దీంతో సొంత ఖర్చులతో నిత్యావసర సరుకులు తీసుకు వచ్చి వండి పెడుతున్నామని తెలిపారు.

## విద్యార్థినికి ఆర్థిక చేయూత

మంచిర్యాల క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణ శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న దేవి అనే విద్యార్థినికి వనితా వాక్కు ఫౌండేషన్ సభ్యులు 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల చదువు కోసం సంస్థ పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తాళ్లపెల్లి కవిత, సునితకుర్మ, మంజుల, బద్రి శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు రిజిని, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



దుండె రాజేశ్వరి

మంచిర్యాల క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఆదిత్య ఎంక్లైవ్‌కు చెందిన దుండె రాజేశ్వరికి డాక్టరేట్ లభించింది. 2009లో డీఎస్సీ ద్వారా మొదటి ర్యాంకు సాధించి దహెగాం ప్రాథమిక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా చేరారు. చదువుపై పట్టుదలతో తన భర్త సహకారంతో ఏపీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విద్యా పీఠం వరంగల్ కేంద్రంలో ఆర్యభట్ట రమేష్ పర్యవేక్షణలో తెలంగాణ ప్రాంత, కుల, సంస్కృతి, సాంప్రదాయాలు, అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు. భర్త బియ్యాల వెంకటేష్ ప్రోత్సహించినందుకే తనకు డాక్టరేట్ లభించిందని వారు తెలిపారు. ప్రస్తుతం చెన్నూరు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు.

## బీసీ నాయకుల అర్ధనగ్న ప్రదర్శన



మంచిర్యాల క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ అమలు కోసం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్‌పై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీసీలకు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని ఇప్పుడు విస్మరిస్తోందని విమర్శించారు. బీజేపీ ఎంపీలు బీసీ రిజర్వేషన్ కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి బీసీలు ఐక్యతతో పోరాడితేనే బీసీ హక్కులు సాధించుకోగలుగుతామని వివరించారు. కార్యక్రమంలో గుమ్ముల శ్రీనివాస్, గజెల్లి వెంకటయ్య, రాగిడి రాజేష్, నెన్నెల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 13మందిపై కేసు నమోదు

**- ఎస్‌ఐపై బదిలీ వేటు**

వేమనపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్ ఆత్మహత్య కేసులో 13మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నీల్వాయి ఎస్‌ఐ కోటేశ్వర్‌ను రామగుండం కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ నాయకులు సంతోష్, గాలి మధు, కమలతో పాటు మరో పది మందిపై కేసు నమోదు చేశారు.

## పులిదాడిలో ఆవు మృతి

సిర్పూర్(టి), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవేగాం గ్రామంలోని శివరాం అనే వ్యక్తికి చెందిన ఆవుపై శుక్రవారం సాయంత్రం పులి దాడి చేసి హతమార్చింది. కాగా సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని ఇటిక్యాల పహాడ్, నవేగాం, చీలపల్లి, మాకిడి, జన్కాపూర్ తదితర అటవీ ప్రాంతంలో రెండు పులులు సంచరిస్తున్నట్లు పశువుల కాపర్లు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న రేంజ్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది సంఘటన స్థలాన్ని సందర్శించారు. పులిదాడిలో ఆవు మృతి చెందినట్లు నిర్ధారించారు. తడోబా అటవీ ప్రాంతం నుంచి రెండు పులులు వచ్చాయని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అటవీ ప్రాంతానికి వెళ్లే వారు గుంపులుగా వెళ్లాలని రైతులు పంటలకు ఇద్దరు ముగ్గురితో కలిసి వెళ్లాలని అవగాహన కల్పిస్తున్నారు. కాగా మళ్లీ పులి అలికిడి నెలకొనడంతో అటవీ ప్రాంత గ్రామాల్లో అలజడి నెలకొంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలో ఉన్నారు. ఎప్పుడు ఎటు వైపు నుంచి వచ్చి దాడి చేస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## లభించని ఆచూకీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వాహిదుద్దీన్

దహెగాం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లకుంట గ్రామానికి చెందిన జుమ్మిడి మధుకర్ శుక్రవారం పెద్దవాగు నదిలో గల్లంతు కాగా శనివారం రాత్రి వరకు ఆచూకీ లభించలేదు. గత రెండు రోజులుగా గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపడుతున్నా ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం సంఘటన స్థలాన్ని డీఎస్పీ వాహిదుద్దీన్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

కౌటాల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలోడి గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. వారి నుంచి రూ.6700 నగదుతో స్వాధీన పరుచకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో తలోడికి చెందిన పరమర్ ప్రకాష్, శంకర్ కాంబ్రే, పాటబోయిన శంకర్, మద్దెల రమేష్, వేములవాడ సత్తయ్య, దుర్గం అశోక్, కౌటాలకు చెందిన ఎల్కులె సంతోష్‌లను పట్టుకున్నట్లు తెలిపారు.

## వ్యవసాయ బావిలో దూకి యువకుడి ఆత్మహత్య



సొటేపల్లి మౌళి(ఫైల్)

దండేపల్లి(లక్షెట్టిపేట) అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం దౌడపల్లి గ్రామ శివారులోని వ్యవసాయం బావిలో పడి దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన సొటేపల్లి మౌళి(32) అనే యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మౌళి రోజు మాదిరిగానే శనివారం తెల్లవారుజామున వాకింగ్ వెళ్తాలని ఇంట్లో బార్యతో చెప్పి వెళ్లాడు. ఉదయం 8వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. దీంతో అతడి జాడ కోసం గాలింపు మొదలుపెట్టారు. లక్షెట్టిపేట మండలం దౌడపల్లి గ్రామ శివారులో ఓ వ్యవసాయం బావి దగ్గర బైక్‌తో పాటు అతని సెల్‌ఫోన్, చెప్పు పెట్టి ఉన్నాయి. అనుమానంతో ఆ వ్యవసాయ బావిలో వెతుకగా బావిలో మృతదేహం లభ్యం అయింది. మౌళి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని అతని తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సురేష్ వెల్లడించారు. మృతుడికి భార్య సంజన, 10నెలల కొడుకు జయరాం ఉన్నారు.

## కబ్జా చేసిన భూమిని స్వాధీనం చేసుకోవాలి

బెల్లంపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పద్మశాలి భవన్‌కు ఆనుకొని ఉన్న సింగరేణి స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని భూమి కబ్జా కాకుండా సింగరేణి స్వాధీనం చేసుకోవాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కబ్జా చేసిన భూమిని పరిశీలించి మాట్లాడారు. పద్మశాలి భవన్ ట్రస్టుకు సంబంధించిన వారు సింగరేణి సంస్థకు చెందిన భూమిని కబ్జాకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ భూమిని సింగరేణి యాజమాన్యం కబ్జాకు గురి కాకుండా పెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం భూమిని ఉపయోగించాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే సైతం సింగరేణి భూమిని కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు సూరిబాబు, గెల్లి రాజలింగు, ఆడెపు రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ, దేవసాని ఆనంద్, రత్నం రాజం, చంద్రమాణిక్యం, మల్లయ్య, చిప్ప నర్సయ్య, రాయలింగు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తుల అరెస్టు




వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

మందమర్రిటౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మందమర్రి పట్టణంలోని జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద శనివారం గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎస్ఐ రాజశేఖర్ వివరాలను వెల్లడించారు. రహదారి వద్ద తనిఖీలు చేస్తుండగా హోండా డియోస్కూటీ (టీజీ19ఏ3932)పై ముగ్గురు వ్యక్తులు మందమర్రి మండలం పొన్నారానికి చెందిన ఏల్పుల వర్షిత్, ఆదిల్‌పేటకు చెందిన వేల్పుల రాహుల్, నస్పూర్‌కు చెందిన ఐత మనిదీప్‌లు వెళ్తుండగా వారిని పట్టుకుని తనిఖీ చేశామన్నారు. వారి వద్ద వంద గ్రాముల గంజాయి దొరిందని తెలిపారు. వీరు కాగజ్‌నగర్ నుంచి ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి ఈ ప్రాంతంలో అమ్మడానికి వ్యక్తిగత వినియోగానికి తీసుకువస్తుండగా పట్టుబడ్డారన్నారు. ఎవరైనా గంజాయి రవాణా చేసిన విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## సీఎండీని కలిసిన ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు చెందిన పలు ప్రధాన సమస్యలపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె రాజ్‌కుమార్‌లు శనివారం సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్, డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రును కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రధానంగా డిపెండెంట్ ఎంప్లాయిమెంట్‌కు సంబంధించిన మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయిన కార్మికుల వారసులకు వెంటనే పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని కోరామన్నారు. మెడికల్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, బదిలీలను వెంటనే చేపట్టాలన్నారు. క్లర్కులకు సంబంధించిన రిక్రూట్‌మెంట్ పరీక్ష నిర్వహించి త్వరగా పూర్తి చేయాలని, డిస్మిసల్ కార్మికులకు ఒక అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. వీటన్నింటికి సీఎండీ, డైరెక్టర్(పా) సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

## రక్షణతో కూడిన విద్యుత్ ఉత్పత్తి సాధించాలి



మూడో యూనిట్ పవర్ ప్లాంటు పనులను పరిశీలిస్తున్న నందకుమార్

జైపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రక్షణతో కూడిన విద్యుత్ ఉత్పత్తి సాధించాలని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ నందకుమార్ పేర్కొన్నారు. శనివారం జైపూర్‌లోని ఎస్టీపీపీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. 800 మెగావాట్ల మూడో యూనిట్‌కు సంబంధించిన పవర్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయిన సందర్భంగా ఎస్టీపీపీ యాజమాన్యం ఆమోదం కోసం దరఖాస్తు చేసుకోగా ఈ పనులను తనిఖీ చేశామని తెలిపారు. ఐదు మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను అద్భుతంగా నిర్మించారని, నిర్వహణ చాలా బాగుందని తెలిపారు. రక్షణపై తీసుకుం టున్న చర్యలు బాగున్నాయని అధికారులను ప్రశంసించారు. కార్యక్రమం లో డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహారావు, అధికారులు మదన్‌మోహన్, శ్రీనివాస్, వేణుగోపాల్, మధుకర్, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు నెలలుగా వేతన వెతలు

- జీతాలు ఇవ్వని సీఆర్‌ఆర్ ఓబీ యాజమాన్యం - ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు



ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలోని సీఆర్‌ఆర్ ఓబీ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఫలితంగా వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఆర్‌ఆర్-ఉదయ్ కంపెనీలో సుమారు 600 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఓవర్ బర్డెన్(ఓబీ) వెలికితీసే పనిలో పాలుపంచుకుంటున్నారు. అయితే 26-08-2025 రోజున యంత్రాల మరమ్మతుల నిర్వహణకు నాలుగు రోజులు కంపెనీ బంద్ పెడుతున్నామని, తిరిగి 02-09-2025 రోజున యథావిధిగా నడుపుతామని యాజమాన్యం కార్మికులకు సమాచారం ఇచ్చింది. కార్మికులు కూడా అంగీకరించారు. కానీ గడువు ముగిసినా కంపెనీ తెరవలేదు. ఓబీ పనులు చేపట్టలేదు. దీంతో అప్పటికే నాలుగు నెలల వేతనాలు పొందాల్సిన కార్మికులు మోసపోయామని తెలుసుకుని శ్రీరాంపూర్ ఓసీపీ పీవో, ఏరియా జీఎం దృష్టికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే కంపెనీ వారు సింగరేణికి కోట్ల రూపాయలు బకాయి పడడంతో అధికారులు కూడా ఏమీ చేయలేని స్థితి ఏర్పడింది. ఈ తరుణంలో గతనెల 23న ఓసీపీలో ఆందోళనకు దిగారు. ఈ నెల 6 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఎమ్మెల్యేకు, జీఎంకు, పీవోకు, పోలీసులకు దరఖాస్తులు ఇచ్చారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కానీ ఇంతవరకు వారికి రావాల్సిన నాలుగు నెలల వేతన బకాయిలు సుమారు ఐదు కోట్ల రూపాయలు రాలేదు. ఈ తరుణంలో శనివారం సైతం ఓసీపీ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దసరాకు వేతనాలు ఇప్పిస్తారని ఆశగా ఎదురుచూశామని, కానీ దీపావళి వస్తున్నా డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై సీఆర్‌ఆర్ కంపెనీ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేయగా, ఆయన స్పందించలేదు.

### ఉద్రిక్తంగా మారిన ఆందోళన

తమ వేతనాలు చెల్లించాలని శనివారం ఉదయం నుంచి కాంట్రాక్ట్ కార్మికులు చేపడుతున్న ఆందోళన సాయంత్రం ఉద్రిక్తంగా మారింది. ఓసీపీ ప్రధాన రహదారిపై ఉదయం నుంచి టెంట్ వేసుకొని కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేస్తున్నారు. అక్కడే వంటలు చేసుకొని భోజనాలు చేశారు. సాయంత్రం వేళ జీఎం ఎం శ్రీనివాస్ అక్కడికి రావడంతో కార్మికులు ఆయనతో మాట్లాడుతుండగానే కొందరు పెట్రోల్ ఒంటిపై పోసుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే పోలీసు సిబ్బంది స్పందించి వారిని అడ్డుకున్నారు.

అప్పటి నుంచి పలు దఫాలుగా చర్చలు జరిపినా కార్మికులు ససేమిరా అన్నారు. వేతనాలు చెల్లించేవరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని భీష్మించారు. రాత్రి కూడా ఆందోళన కొనసాగుతోంది. జీఎం శ్రీనివాస్, ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఇతర అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. శ్రీరాంపూర్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

రెబ్బెన, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజం కానీ వాటిని పట్టించుకోకుండా నిరంతర సాధన చేసే వారికి ఓటమి ఉండదని బెల్లంపల్లి ఏరియా ఎస్టేట్ అధికారి వి.సాగర్ అన్నారు. శనివారం గోలేటిలోని భీమన్న మైదానంలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 92వ వార్షిక క్రీడలలో భాగంగా డిపార్టుమెంట్ బాస్కెట్ బాల్ పటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ ఆట ఆడినా శారీరక దారుఢ్యంకు సమానంగా మానసికంగా పరిపక్వత ముఖ్యమన్నారు. ఉద్యోగ క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. బాస్కెట్ బాల్ పోటీల్లో ఖైరిగూడ పీఓ జట్టుపై ఎస్ఓ టు జీఎం జట్టు గెలుపొందింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ అన్వేష్, జనరల్ క్యాప్టెన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

రెబ్బెన, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా శనివారం జీఎం కార్యాలయం ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవా బుదారీతనం కోసం సమాచార హక్కు చట్టం చేశారన్నారు. చట్టాన్ని సమాజ ప్రయోజనాలకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించా రు. వ్యక్తుల, వ్యక్తిగత సమాచారం, దేశ రక్షణ రహస్యాల విషయంలో చట్టం ద్వారా సమాచారాన్ని పొందలేరన్నారు. చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితాలుంటాయన్నారు. ఏఐటీయూసీ నాయకుడు కిరణ్, నాయకులు నరేందర్, ఎస్‌వోటు జీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్ కు మార్ బెహరా, హెచ్‌వోడీ శ్రీనివాస్, పర్సనల్‌అధికారి ప్రశాంత్, పాల్గొన్నారు.

## నిర్బంధాలతో ఆదివాసీ ఉద్యమాన్ని ఆపలేరు

కాసిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల నిర్బంధాలతో ఆదివాసీ ఉద్యమాన్ని ఆపలేరని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడే జంగు అన్నారు. శనివారం దేవాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఎస్టీ జాబితాలోకి చేర్చిన వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఆదివాసీ తుడుందెబ్బ ఆధ్వర్యంలో దశల వారీగా అనేక ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో తుడుందెబ్బ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మహిపతి అరుణ్‌కుమార్‌పై కొందరు లంబాడీలు రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీల పక్షాన పోరాడే నాయకులను లక్ష్యంగా చేసుకుని నిర్బంధాలకు పాల్పడితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఇప్పటికైనా రాజ్యాంగ బద్దంగా అక్రమంగా ఎస్టీజాబితాలోకి చేర్చిన వలస లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాగౌరవాధ్యక్షుడు పెంద్రం హనుంతు, విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిడాం రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు, నాయకులు గోవర్ధన్, మహేష్ పాల్గొన్నారు.

### జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ

దండేపల్లి (లక్సెట్టిపేట) అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 14, 17బాలబాలికల అథ్లెటిక్ ఎంపిక పోటీల్లో లక్సెట్టిపేటకు చెందిన బ్రిలియంట్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కే రోహిత్ షార్ట్‌పుట్ డిస్కస్‌లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలో ప్రథమ స్థానం నిలువగా, 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్ రితిక ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో మూడవ స్థానం నిలిచారు. ఈసందర్భంగా బ్రిలియంట్ హైస్కూల్ డైరెక్టర్లు, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, టీచర్లు, ఉపాధ్యాయులు శనివారం పాఠశాలలో వీరిని అభినందించారు.

### మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



చంద్రయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి వివేక్

మందమర్రిటౌన్, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండల మాజీ ఎంపీపీ జిల్లా కాంగ్రెస్ నాయకుడు బొలిశెట్టి కనకయ్య తండ్రి చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి వివేక్ వెంకటస్వామి శనివారం కనకయ్య నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. అంతకుముందు చంద్రయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

చంద్రయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి వెంకటస్వామి

### మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు

మందమర్రిరూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సారంగపల్లి పంచాయతీలోని తుర్కపల్లిలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. సారంగపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఉన్నప్పటికీ తుర్కపల్లి నుంచి సారంగపల్లికి వెళ్లాలంటే కిలోమీటరు దూరం వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం లేక చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, గుడ్లు అందడం లేదని పేర్కొంటున్నారు. గత సర్వసభ్య సమావేశంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని సభ్యులు ప్రస్తావించినా ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. వెంటనే తుర్కపల్లిలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

బెల్లంపల్లి, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రసూన అన్నారు. శనివారం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులతో సమావేశమై మాట్లాడారు. రైతులు పప్పు ధాన్యాల పంటల్లో స్వయం సమృద్ధి సాధించాలని పేర్కొన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని దీంతో రైతులకు దిగుబడులు వచ్చే ఆవకాశం ఉంటుందన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతిన రైతులు పంటలు పండించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ పంటల్లో పాటించాల్సిన పంటల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కేవీకే సిబ్బంది శ్రీనివాస్‌రావు, తిరుపతి, ప్రియా సుగుండి పాల్గొన్నారు.

# మూడు దారుల మణిహారం




జైపూర్ మీదుగా జగ్దల్‌పూర్‌కు వెళ్లే రహదారి

## రెండు జాతీయ, ఒక రాష్ట్ర రహదారికి వేదికగా జైపూర్

జైపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక, వ్యవసాయ, పర్యాటక, ఆధ్యాత్మిక రంగాలతో కూడిన జైపూర్ మండలానికి మరో నూతన గుర్తింపును అదుగులు పడుతున్నాయి. ఇప్పటికే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్టీపీపీ) ఏర్పాటుతో విద్యుత్ హబ్‌గా, ఉపరితల గనితో బొగ్గును, పర్యాటకానికి అనువుగా శివ్వారం మొసళ్ల అభయారణ్యం, వేలాల, గట్టు మల్లన్న దేవాలయాలతో ఆధ్యాత్మికంగా తనకంటూ ప్రత్యేకంగా నిలిచింది. అలాంటి జైపూర్ మండలంలో ఇప్పటి వరకు ఒక జాతీయ రహదారి, ఒక రాష్ట్ర రహదారి ఉండగా మరో జాతీయ రహదారి నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లా అభివృద్ధిలో ఈ మార్గం కీలకం కానుంది.

### ఇందారం ఎక్స్‌రోడ్డు నుంచి హైద్రాబాద్...

రాష్ట్రంలోని రాజీవ్ రహదారి జైపూర్ మండలం ఇందారం నుంచి హైద్రాబాద్ వరకు విస్తరించింది. ఈ మార్గం గుండా ప్రధాన పట్టణాలైన రామగుండం, పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, హైద్రాబాద్ వంటి నగరాలకు విద్య, ఉద్యోగ, వాణిజ్య, వైద్యం కోసం నిత్యం జిల్లాతో పాటు పక్క జిల్లాల, రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తు న రాకపోకలు సాగిస్తుంటారు.

### నూతనంగా మంచిర్యాల నుంచి వరంగల్ వరకు...

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కేంద్రం మంచిర్యాల నుంచి వరంగల్ వరకు 110 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్163జీ పేరుతో నూతన రహదారి నిర్మాణం ప్రారంభిస్తుంది. ఈ మార్గాన్ని వరంగల్ నుంచి ఖమ్మం మీదుగా విజయవాడ వరకు అనుసంధానిస్తుండగా ఇటు మంచిర్యాలలో నుంచి నాగ్‌పూర్ వరకు వెళ్తుంది. ఆసి దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు సరకు రవాణాను సులభతరం చేయడం కోసం పట్టిల గుండా నిర్మాణం జరుగుతున్న ఈ మార్గం ద్వారా గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుతం ఈ మార్గ జైపూర్ మండ లం రసూల్‌పల్లి నుంచి మొదలుకుని పలు గ్రామాల నుంచి వెళ్తుంది. పనులు ప్రారంభం కావడంతో ఇప్పటికే ఆయా గ్రామాల భూముల ధరలకు రెక్కలు వచ్చాయి.

### నిజామాబాద్ నుంచి జైపూర్ మీదుగా జగ్దల్‌పూర్ వరకు

నిజామాబాద్ జిల్లా నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగ్దల్‌పూర్ వరకు ఏర్పాటు చేసిన 63వ నెంబరు జాతీయ రహదారి జైపూర్ మండలం మీదుగా వెళ్తుంది. ఇది కోటేశ్వరాలతో పాటు మహారాష్ట్రలోని సిరొంచ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు దీని ద్వారా ప్రయాణం చేయవచ్చు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ నుంచి ఇనుము, ఇతర ఉత్ప త్తులతో పాటు మహారాష్ట్ర నుంచి వ్యవసాయ ఉత్ప త్తులను రాష్ట్రంలోని ముఖ్య నగరాలకు చేరవేయడంలో ఈ మార్గం ముఖ్య పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా ఈ మార్గం గుండా విశాఖ పట్నానికి సైతం ప్రయా ణాలు సాగించవచ్చు.




ఇందారం ఎక్స్‌రోడ్డు నుంచి హైద్రాబాద్‌కు వెళ్లే రహదారి

# బీసీలకు అన్యాయం చేసిందే బీఆర్ఎస్ పార్టీ

●పార్లమెంట్‌లో ఒత్తిడి చేసి రిజర్వేషన్‌లు అమలు చేయించాలి ●మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని బీసీ లకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని రాష్ట్ర కార్మిక, ఉ పాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. పార్లమెంట్‌పై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో పెండ్డింగ్‌లో ఉన్న 9 ఆధారంగా బీసీ బిల్లును అమలు చేయించాల్సిన బాధ్యత బీజేపీ నాయకులపై ఉందన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలోని బీసీలకు పెద్దపీట వేయాలనే సంకల్పంతో 42 శాతం రిజర్వేషన్‌లను అసెంబ్లీలో తీర్మానం చేసిందని, తీర్మాన పత్రాన్ని గవర్నర్‌కు కూడా పంపించిన్నారు. గవర్నర్ కూడా ఈ బిల్లును ఆమోదించలేదన్నారు. బీసీ రిజర్వేషన్‌లపై మాట్లాడుతున్న బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండు ఒక్కటేనని తెలిపారు. బీసీలపై ప్రేమ ఉంటే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రిజర్వేషన్లు అమలు చేయించాలన్నారు. రిజర్వేషన్‌లు అమలైతే ఇతర పార్టీలకు పుట్టగతులు ఉండవనే కారణంతో తమ పార్టీపై విమర్శలు చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్‌ల కోసం కృషి చేస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీసీ రిజర్వేషన్‌ల ఆధారంగా ముందుకు వెళ్లారని చూశాన్నారు. బీసీలు వాస్తవాలను కూడా గ్రహించాలన్నారు. తమ ప్రభుత్వం బీసీ పక్షపాత ప్రభుత్వమని గుర్తించాలన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని తెలిపారు. ఇప్పటికే 50 శాతం తాము ముందున్నామన్నారు. బీసీలకు రాజకీయంగా పెద్దపీట వేయాలని నవీన్ యాదవ్‌కు తమ పార్టీ టికెట్ ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మందమర్రిలో మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

### చీఫ్ జస్టిస్‌పై చెప్పులు విసరడాన్ని ఖండించాలి

దేశంలోనే అత్యున్నత న్యాయం స్థానం సుప్రీం కోర్టు గవాయిపై చెప్పులు విసరడం ప్రమాదకరమని దీనిని అందరూ ఖండించాలని తెలిపారు. శనివారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ దేశంలో కుల వివక్ష ఇంకా పోలేదని తెలిపారు. కుల దురహంకారంతోనే దాడులు జరుగుతున్నాయని, దళితులు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్న వారిని అణచి వేయడానికి, అణగదొక్కడానికి దాడులు జరుగుతున్నాయన్నారు. దీనిని ఖండిస్తున్నానని తెలిపారు.

# వంతెన..అంతేనా?

(5వ పేజీ తరువాయి)

వంతెన నిర్మాణం కేవలం ప్రతిపాదనలకే పరిమితం అయిందిగానీ ఆచరణలోకి రాలేదు. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కాజ్‌వే పూర్తిగా కూలిపోయింది. వంతెన పై నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

### రూ. 13.50 కోట్లతో హై లెవల్ వంతెన...

ప్రజల విన్నపాల మేరకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు కాజ్‌వే స్థానంలో హై లెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలనే తలంపునకు వచ్చారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ. 13.50 కోట్లతో హై లెవల్ వంతెన నిర్మాణానికి గత ఏడాది భూమిపూజ చేశారు. వంతెన నిర్మాణంతో అవతలివైపు ఉన్న పాత మంచిర్యాల, రంగాపేట, పవర్ హౌజ్ కాలనీ, అండాళ్ళమ్మకాలనీ ప్రజలకు రాక పోకలు సులభతరం కానుండగా, ఆయా ప్రాంతాలు వే గంగా అభివృద్ధి చెందే అవకాశాలు అనేకం ఉన్నాయి. తెలంగాణ అమరవీరుల స్థూపం మొదలుకొని వాగు అవతలివైపు సుమారు 200 మీటర్ల పొడవుతో వంతెన నిర్మాణం జరుగనుండగా, మొత్తంగా రూ. 20 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు.

### ముందుకు సాగని పనులు...

హై లెవల్ వంతెన నిర్మాణానికి కాంట్రాక్టర్ సాయిల్ టెస్ట్ కూడా పూర్తి చేశారు. దాదాపు ఎనిమిది నెలలు గడుస్తున్నా సాయిల్ టెస్ట్ మినహా వంతెన నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. సాయిల్ టెస్ట్ పూర్తయినందున వంతెన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ చేపడితే నిర్మాణ పనులు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యేతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చొరవ చూపాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

## సైడ్ డ్రైన్ పనులు ప్రారంభం

కాసిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రహదారులు, సైడ్ డ్రైన్‌పనులు కొనసాగిస్తున్నామని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎనికె మూర్తుజా అన్నారు. శనివారం చిన్న ధర్మారంలో రూ. 5 లక్షలతో నిర్మించే సైడ్‌డ్రైన్ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సైడ్‌డ్రైన్ లేకపోవడంతో వర్షాకాలంలో వర్షం నీరు, వరద నీరు ఇళ్లలోకి చేరి తుంటని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డీఎంఎఫ్‌టీ నిధులతో సైడ్‌డ్రైన్ పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫారూక్, వెంకన్న, రెహ్మాన్, తిరుపతి, రాజన్న పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

కోటపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వాయిపేట గ్రామంలో శ నాయకులు కాంగ్రెస్ బాకీ కార్డును బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటి వరకు ఒక్క పథకం కూడా అందించలేదన్నారు. వారి మోసాలను ప్రజల్లోకి తీసు కువెళ్లి ఎంద గట్టడానికి ఏ వర్గానికి ఎంత బాకీ పడ్డారో ప్రజలకు తెలియజేయడానికి కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొట్టె నారాయణ, కదార్ల ధనుంజయ్, ఉప్పరి శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్, మండల సోషల్ మీడియా వారియర్ బాపునాయక్, రాజకుమార్ యాదవ్, రమేష్, కిరణ్, మేకల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం పట్టణంలో ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. 22 నెలల కాంగ్రెస్ పాలనలో గ్యారంటీల జాడ లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఒక్కటి కూడ పూర్తి స్థాయిలో నెరవేర్చలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వద్దకు వెళ్లి వివరించారు. కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల అసంతృప్తితో ఉన్నాయని బీఆర్ఎస్ శ్రేణులు సమిష్టిగా పని చేసి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రవేశపెట్టిన మీలు జరిగేలా పాలన అందించాలన్నారు. జరుగబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, యూత్అధ్యక్షులు నల్లని అరుణ్, నాయకులు గోలి శివ, పాల్గొన్నారు.



బాకీ కార్డును పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

# బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించేంత వరకు ఉద్యమిస్తాం

చెన్నూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాదు చట్టసభల్లో కూడా బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించేంత వరకు ఉద్యమిస్తామని బీసీ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్‌లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ శనివారం చెన్నూరు పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి పాత బస్ స్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌక్‌వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్, జ్యోతిబాపూలే, సావిత్రి బాయి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు సిద్ది రమేష్ యాదవ్ మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్‌లను సాధించేంత వరకు ఐక్య కార్యాచరణతో ఉద్యమిస్తామన్నారు. 5 శాతం లేని అగ్ర వర్ణాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను ఏ జనాభా ప్రతిపాదికన అమలు చేశారని ప్రశ్నించారు ఈడబ్ల్యూఎస్ వల్ల బీసీలకు అన్యాయం జరిగినప్పటికీ బీసీలు కోర్టుల్లో ఎటువంటి పిటిషన్ వేయలేదన్నారు. కాని 60 శాతం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తే ఓర్వలేక అడ్డుకున్నారన్నారు. విద్య, ఉద్యోగాల్లో కూడా బీసీ రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.




చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

# జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకుల ఆందోళనలు



మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ వేమనపల్లి మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మధుకర్ మృతికి కారణమైన కాంగ్రెస్ పార్టీ నాయకులను, వారి ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమంగా కేసులు నమోదు చేసిన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ముకేష్‌గౌడ్, అమిరిశెట్టి రాజకుమార్, రాకేష్, ఆకుల అశోక్‌వర్ధన్ పాల్గొన్నారు.

**బెల్లంపల్లి:** పట్టణంతో పాటు మండలంలో బీజేపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆత్మహత్యకు కారణమైన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి జైలుకు పంపాలని, లేని యెడల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు కోడి రమేష్, పట్టణ అధ్యక్షులు కత్తాల, నాయకులు సంతోష్, రాజయ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

**చెన్నూరు:** వేమనపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ మృతికి కారణమైన కాంగ్రెస్ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి మాజీ ఎంపీ, రాష్ట్ర బీజేపీ నాయకులు వెంకటేష్ నేత డిమాండ్ చేశారు. ఏట మధుకర్ మృతదేహాన్ని శనివారం చెన్నూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అనుమతి వద్ద మృతుని కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. మధుకర్ మృతికి కారణమైన రు ప్రకట్ల సంతోష్, గాలి మధు, కమలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

**తాండూర్:** తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని రహదారిపై ధర్నా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, జిల్లా కార్యదర్శి మహేందర్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

**భీమారం:** భీమారంలో బీజేపీ నాయకులు మధుకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్ నాయకులు రాజేశం యాదవ్, మాడెం శ్రీనివాస్, మల్లేష్, విజయ్, కుమారస్వామి పాల్గొన్నారు.

**కాసిపేట:** మండలంలోని దేవాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్ నాయకులు పాల్గొన్నారు.

**నెన్నెల:** మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అంగొత్ శేఖర్ మాట్లాడుతూ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు తమ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందన్నారు. నాయకులు శైలేందర్ సింగ్, రాజేందర్, వంశీ, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

**కోటపల్లి:** మండల కేంద్రంలో బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ నాయకులు పెద్దింటి పున్నంచంద్ మాట్లాడుతూ మృతికి కారణమైన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు వెంకటేష్, శ్యాంసుందర్, సుంకె నరేష్, చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

**దండేపల్లి :** దండేపల్లిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట పార్టీ నాయకులు శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు దర్శనాల రవిగౌడ్, సంతోష్, జిల్లా నాయకుడు ఎంబడి సురేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజలింగం, శ్రీనివాస్, వెంకటేష్, మహేష్, మల్లేష్, సత్యనారాయణ, శేఖర్‌పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్ :** వేమనపల్లి బీజేపీ అధ్యక్షుడు ఏట మధుకర్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల సీనియర్ నాయకుడు దేవరనేని సంజీవరావు, బీజేపీ మండల అధ్యక్షుడు గిర్నాటి జనార్దన్ డిమాండ్ చేశారు. శనివారం చిర్రకుంటలో మధుకర్‌చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు.



చెన్నూరు ఆసుపత్రి వద్ద మాట్లాడుతున్న మాజీ ఎంపీ వెంకటేష్ నేత

## అథ్లెటిక్స్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్

బెల్లంపల్లి, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణానికి చెందిన కాసిపేట గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో 14 మంది విద్యార్థులు పాల్గొనగా 12 మంది విద్యార్థులు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రిన్సిపాల్ సంతోష్, ఉపాధ్యాయులు సన్మానించారు. పతకాలు సాధించిన వారిలో సంకేత్, లక్ష్మణ్, సాహిత్య, చరణ్, సిద్దార్థ, రాకేశ్, చరణ్, విఘ్నేశ్‌యాదవ్ స్వర్ణ, రజత పతకాలను సాధించారు.

### అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలి

జైపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ అనిత పేర్కొన్నారు. శనివారం జైపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో జరిగిన వ్యాక్సినేషన్, పిల్లలకు ఇచ్చే టీకాలు, వ్యాక్సిన్‌లను పరిశీలించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పార్మా సిస్టులు, నర్సింగ్ సిబ్బంది, వైద్యులు, ఏఎన్ఎంలు ప్రతి బుధ, శనివారాల్లో టీకాల కార్యక్రమం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో ప్రశాంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.






మూడు దారుల **మణిహారం..** రెండు జాతీయ, ఒక రాష్ట్ర రహదారికి వేదికగా జైపూర్ 7

ఇళ్లపై వేలాడుతున్న **విద్యుత్ తీగలు** పట్టించుకోని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు 6

బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించేంత వరకు **ఉద్యమిస్తాం** బీసీ జేఏసీ నాయకుల ర్యాలీ 7




## రామగుండంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ముందడుగు

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ క్రిష్ణ**

మందమర్రిటౌన్, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన రామగుండంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కీలక అడుగు పడిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ క్రిష్ణ పేర్కొన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 40.53లక్షలు మంజూరు చేసి ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు ప్రీ ఫిజిబిలిటీ స్టడీ ఫీజు చెల్లించన్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గావ్ మండలంలో 591 ఎకరాల భూమికి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదనపై స్టడి జరుగనుందని తెలిపారు.

రెండేళ్లుగా ఎయిర్‌పోర్టు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం ఉందని ప్రత్యక్ష అను సంధానం ఏర్పడుతుందన్నారు. మన ప్రాంతానికి నూతన ఆర్థిక పారిశ్రామిక అవకాశాలను కల్పిస్తుందన్నారు. విశాల దృక్పథంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎయిర్‌పోర్టు ఏర్పాటు అయ్యే వరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై మంత్రి ఆరా

భీమారం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై మంత్రి వివేక్‌వెంకటస్వామి శనివారం సాయంత్రం మండల నాయకులతో కలిసి ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మండలంలో అత్యంత నిరుపేదలు ఉన్నారని, దీంతో కనీసం బేస్‌మెంట్ కట్టుకోవడానికి డబ్బులు లేవని మంత్రికి తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి ఎంత మంది నిరుపేదలు బేస్‌మెంట్ చేసుకోవడానికి ఆర్థికంగా వెనకబడి ఉన్నారో వారి పేర్లతో కూడిన జాబితాను తయారు చేయాలని మండల నాయకులకు సూచించారు. మంత్రి వెంట నాయకులు ఉన్నారు.

# వంతెన..అంతేనా?

**నిర్మాణానికి కలగని మోక్షం..**
- పూర్తిగా కూలిపోయిన రాళ్లవాగు కాజ్‌వే బ్రిడ్జి
- నిధులు కేటాయించినా ప్రారంభంకాని పనులు
- రంగంపేట వాసులకు తప్పని రవాణా తిప్పలు



ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కూలిపోయిన కాజ్‌వే వంతెన

మంచిర్యాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాళ్లవాగుపై హై లెవల్ వంతెన నిర్మాణానికి మోక్షం లభించడంలేదు. నిధులు కేటాయించి, సాయిల్ టెస్ట్ పనులు కూడా పూర్తయినా వంతెన నిర్మాణం ఊసే ఎత్తకపోవడంతో రంగంపేట వాసుల రవాణా తిప్పలు తప్పడం లేదు. మంచిర్యాల నగరంలోని బైపాస్ రోడ్డులోగల తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద ఉన్న కాజువే బ్రిడ్జి స్థానంలో నూతన హై లెవల్ వంతెన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు 10 మార్చి 2024న భూమి భూమిపూజ చేశారు. అయితే ఎమ్మెల్యే భూమిపూజ చేసి 19 నెలలు గడుస్తున్నా ఇంతవరకు పనులు ప్రారంభం కాకపోవడంతో ముఖ్యంగా రంగంపేట, పవర్ హౌజ్ కాలనీ, అండాళమ్మ కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### 2005లో కాజ్‌వే నిర్మాణం...

పట్టణంలోని లక్ష్మీటాకీస్ ప్రాంతాన్ని, పాత మంచిర్యాల సమీపంలోని రంగంపేటను కలిపేందుకు 2005లో సుమారు రూ. 80 లక్షల అంచనా వ్యయంతో రాళ్ల వాగుపై పైపులతో తాత్కాలిక కాజువే వంతెన నిర్మించారు. బైపాస్ రోడ్డులోని తెలంగాణ అమరుల స్థూపం నుంచి కాజ్‌వే మీదుగా ఆయా ప్రాంతాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. అంతకు ముందు వంతెన లేని సమయంలో ఆ ప్రాంత ప్రజలు పట్టణానికి రావాలంటే పాత మంచిర్యాల మీదుగానో, అండాళమ్మ కాలనీ మీదుగా ఎంసీసీ క్వారీ రోడ్డులో ఐదారు కిలో మీటర్లు ప్రయాణించేవారు. దీంతో ప్రజలకు విపరతీంగా దూర భారం పెరగడంతోపాటు అధిక వ్యయ ప్రయాసల కు గురి అయ్యేవారు.

కాజ్‌వే వంతెన నిర్మాణం తరువాత కేవలం అర కిలోమీటర్ ప్రయాణించి పట్టణానికి చేరుకుంటున్నారు. పాలు విక్రయిస్తూ జీవనం సాగించే రంగంపేట ప్రజలు ఈ వంతెన గుండానే ప్రయాణిస్తారు. అలాగే పాఠశాలలు నడిచే సమయంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రాళ్లపేట, బైపాస్ రోడ్డు ప్రాంతంలోని ప్రజలు ఇప్పటికీ కాజువే వంతెన పై నుంచే పాత మంచిర్యాల మీదుగా ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు.

### వరదలకు కూలిన వంతెన..

రాళ్లవాగుపై తాత్కాలికంగా నిర్మించిన కాజువే 2019 లో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహంలో మునిగి కుప్పకూలిపోయింది. అప్పట్లో కూలిన చోట మట్టితో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే ప్రతియేటా వర్షాకాలంలో కాజువే మునిగి పోవడం, ఆ తరువాత వంతెన కూలిపోవడం పునరా వృతం అవుతూనే ఉన్నాయి. కూలిన ప్రతీసారీ తాత్కాలిక చర్యలకు పూనుకోవడం తప్పితే శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచనలు చేయలేదు.

సంవత్సరాలు గడుస్తున్నా ప్రజా ప్రతినిధులుగానీ, మున్సిపల్ పాలకవర్గం గానీ ఎలాంటి శాశ్వత పరిష్కారం చూపలేదు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు కాజువేపై రాకపోకలు సాగించే వారు భయభ్రాంతులకు గురయ్యేవారు. కాజువే వంతెన నిర్మాణానికి ముందు అదే ప్రాంతంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదన ఉండేది. అయితే 2005కు పూర్వం ఆ ప్రాంతం పెద్దగా అభివృద్ధి చెందకపోవడంతో అప్పటి పాలకులు కాజువే వంతె నతో సరి పెట్టారు. కాల క్రమంలో రంగంపేట ప్రాంతం విపరీతంగా అభివృద్ధి చెందడం, సమీపంలో కొత్త కాలనీలు ఏర్పాటు కావడంతో ప్రజల సౌకర్యార్థం హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదనలు తెరమీదికి వచ్చాయి. పాలకులు సైతం హై లెవల్ బ్రిడ్జి ఆవశ్యకతపై అనేక సార్లు ప్రస్తావనకు తెచ్చారు. అయితే దశాబ్దాలు గడిచినా... (తరువాయి 7లో)

## కాంగ్రెస్ నాయకులు, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

**సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు**



మధుకర్‌అంతిమ యాత్రలో పాడెను మోస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

వేమనపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యకు కారణమైన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎస్ఐలను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన మధుకర్ కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. మధుకర్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. మధుకర్ ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విచారణ పేరిట వేధింపులకు గురి చేసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంతిమయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, బీజేపీ రాష్ట్ర నాయకులు కొయ్యల ఏమాజీ, బీజేపీ నాయకుడు గోమాస శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనుచరుల వేధింపులతోనే ఆత్మహత్య

**మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేద దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అనుచరుల వేదింపులతోనే వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే అనచరులు కాంగ్రెస్ నాయకులు రుద్రబట్ల సంతోష్‌తో పాటు నాయకులు ఎమ్మెల్యే అండదండలతోనే మధూకర్‌పై పోలీసులతో అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. అక్రమ కేసులు బనాయించి మధూకర్‌ను మనోవేధనకు గురి చేశారని దీంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, నాయకులు సత్యనారాయణ, అరుణ్, గోపి పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి(లక్షెట్టిపేట) అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. లక్షెట్టిపేట పట్టణంలో శనివారం దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీ పథకాల పేరిట ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. ఓట్ల కోసం వచ్చి నప్పుడు ఈ బాకీ కార్డులను వాళ్లకు చూపించి మీకు రావలసిన హామీలన్నింటిని ఇవ్వాలని వాళ్లను డిమాండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓట్ చోరీపై ప్రజలకు అవగాహన

**మంత్రి వివేక్‌వెంకటస్వామి**



మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఓట్ చోరీపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమానికి కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ పిలుపు మేరకు రాష్ట్రంలో కూడా ఓట్ చోరీపై అవగాహన కార్యక్రమం చేపడుతున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. శనివారం పట్టణంలోని బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, గోదావరిఖని నాలుగు రోడ్ల కూడలి జాతీయ రహదారిపై ఓట్ చోరీ సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సంతకాలు చేశారు. మంత్రి మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఓట్ చోరీ జరుగుతుందన్నారు. ఈవీఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయని తమ అధినేత రాహుల్‌గాంధీ పదే పదే ఆరోపిస్తున్నారన్నారు. దీనికి సంబంధించి ఆయా రాష్ట్రాల్లో గురైన ఓట్ల చోరీకి సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చామన్నారు. చీఫ్ ఎన్నికల కమీషన్ కూడా తమకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారన్నారు.

రామకృష్ణపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఓట్ల చోరీ అవగాహన కార్యక్రమానికి మంత్రి వివేక్‌వెంకటస్వామి హాజరై మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా ఉండేందుకు ఓట్ల చోరీ జరుగుతుందన్నారు. ఒక్కో కుటుంబంలో 70 ఓట్ల వరకు నమోదు కావడం ఆశ్చర్యంగా ఉందని తెలిపారు. దీనిపై చీఫ్ ఎన్నికల సంఘం దృష్టి సారించాలన్నారు.

## బాధ్యులను 48 గంటల్లో అరెస్టు చేయాలి

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్
- బీజేపీ మండల అధ్యక్షుడి కుటుంబానికి పరామర్శ



మధుకర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బండి సంజయ్‌కుమార్

వేమనపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యకు కారకులైన వారు ఎక్కడున్నా పోలీసు అధికారులు 48 గంటల్లోపు అరెస్టు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం రాత్రి మధుకర్ కుటుంబ సభ్యులను నీల్వాయి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, కాంగ్రెస్ నాయకులు అనేక వేధింపులకు గురి చేయడంతోనే మధుకర్ ఆత్మహత్య చేసుకున్నట్లు అర్థమవుతుందన్నారు. ఇంత ధైర్యం ఉన్న నాయకుడు ఆత్మహత్య చేసుకున్నాడంటే పోలీసుల వేధింపులు ఎంత తీవ్ర స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుందన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ రోజు మధుకర్ ఇంటి సమీపంలో కాంగ్రెస్ కార్యకర్తలు డీజే బాక్సులు పెట్టుకుని అధికంగా సౌండ్ పెట్టడంతో మధుకర్ ఇంట్లోని వారందరు భయభ్రాంతులకు గురి కావడంతో మధుకర్ డయల్ 100 కు సమాచారం అందించాడని తెలిపారు. న్యాయం చేయాల్సిన పోలీసులు కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతూ అన్యాయంగా ఒక మంచి వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వేధింపులకు గురి చేయ డంతో మానసికంగా ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మధుకర్‌ది ఆత్మహత్య కాదని, కాంగ్రెస్ పార్టీ చేయించిన హత్యగానే తాము భావిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకుల వేధింపులకు బీజేపీ నాయకులు ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. బతికి కొట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని ధైర్యం చెప్పారు. మధుకర్ మృతికి కారణమైన వారిపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసు కోకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ ఎంపీ వెంకటేష్ నేత, బీజేపీ రాష్ట్ర నాయకులు కొయ్యల ఏమాజీ, దుర్గం అశోక్, గోమాస శ్రీనివాస్ ఉన్నారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌కు ఎంపిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న అలుగువెల్లి అర్జున్‌రెడ్డి

మంచిర్యాల క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం హైటెక్ సిటీకి చెందిన అలుగువెల్లి అర్జున్‌రెడ్డి అరుణాచల్ ప్రదేశ్‌లోని ఈటనగర్‌లో జరిగే జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికయ్యారు. మహారాష్ట్ర యూనెక్స్ సన్‌రైజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తన సత్తా చాటి నేషనల్స్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్థానికులు అర్జున్‌రెడ్డిని అభినందించారు.

## ఒకే చోట అన్ని రకాల న్యాయసేవలు..

- నస్పూర్‌లో జిల్లా కోర్టు సముదాయ నిర్మాణ పనులు...
- వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్



శంకుస్థాపన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమపాక, పక్కన కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, న్యాయమూర్తులు

నస్పూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు న్యాయసేవలను ఒకే చోట అందించాలన్న లక్ష్యంతో భవన సముదాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. నస్పూర్‌లో రూ. 81 కోట్ల వ్యయంతో నిర్మించే జిల్లా కోర్టుల భవన సముదాయ నిర్మాణ పనులను శనివారం వర్చువల్ విధానం ద్వారా చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ప్రారంభించగా, నస్పూర్‌లో హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మి నిస్ట్రేటివ్ జడ్జి నగేష్ భీమపాక భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు అన్ని రకాల న్యాయ సేవలను ప్రజలకు అందుబాటులోకి తొందరగానే రానున్నాయన్నారు. నస్పూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి నగేష్ భీమపాక మాట్లాడు తూ ఒకే చోట ప్రజలకు జిల్లా స్థాయిలో అన్ని రకాల న్యాయసేవలు అందుతాయన్నారు. రూ. 81 కోట్ల అంచనా వ్యయంతో భవన నిర్మాణ పనులు మొదలైయ్యాయన్నారు. రెండేళ్ల కాల పరిమితితో జూన్ 2027 నాటికి కోర్టుల భవన సముదాయం పూర్తయ్యే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌కుమార్ దీపక్ మాట్లాడుతూ కోర్టుల భవన సముదాయ పనుల నిర్ణీత గడువు లోగా కాంట్రాక్టర్ పనులు చేయాలని సూచించారు. భవనం పూర్తయితే న్యాయ సేవలు ప్రజలకు చేరువలోకి వస్తాయన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవ రం జగన్ మాట్లాడుతూ 20 ఏళ్ల కల నేడు సాకారం అయిందన్నారు. కోర్టుల ఏర్పాటుకు తామేంతో కష్టపడ్డామన్నారు. అంతకు ముందు హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి నగేష్ భీమపాకకు న్యాయవాదులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కళాకారులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ న్యాయసంఘాల ప్రతినిధులు, న్యాయవవాదులు హైకోర్టు న్యాయమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి వీరయ్య, అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్ డీవో శ్రీనివాస్ రావు, డీసీపీ భాస్కర్, జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, జిల్లాలోని వివిధ కోర్టుల న్యాయమూర్తులు, వివిధ శాఖల అధికారులు, న్యాయ వాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.




విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన